


చిన్న తిరునాళ్ల సందడి

పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): శ్రీతిరుపతమ్మవారి చిన్న తిరునాళ్ల సందడి మొదలైంది. మార్చి 7 నుంచి 11వరకు ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.



సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 544.30 అడుగుల వద్ద ఉంది. ఇది 197.4030 టీఎంసీలకు సమానంగా ఉంది.

ముగిసిన పింఛన్ల పంపిణీ



నెహ్రూనగర్: గుంటూరు జిల్లాలో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ ప్రక్రియ ఆదివారం ముగిసింది. జిల్లాలో 2.51.256 మందికి రూ.69.02 కోట్లు పంపిణీ చేశారు.

న్యూస్‌రీల్

ఆదర్శ రైల్వే స్టేషన్‌గా తీర్చిదిద్దుతాం

పిడుగురాళ్ల: పల్నాడు ప్రాంతంలోని పిడుగురాళ్ల రైల్వేస్టేషన్‌ను ఆదర్శ రైల్వేస్టేషన్‌గా తీర్చిదిద్దుతామని డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ అన్నారు. గుంటూరు డివిజన్‌లో 16 రైల్వేస్టేషన్‌లను ప్రధానమంత్రి అమృత భారత్ పథకంలో భాగంగా అభివృద్ధి చేయడం జరుగుతుందని దీనిలో భాగంగా ఆదివారం పిడుగురాళ్ల రైల్వేస్టేషన్‌ను పరిశీలించడం జరిగిందన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం సౌకర్యవంతమైన విశ్రాంతి గది, ఓవర్ బ్రిడ్జి, లిఫ్ట్ సౌకర్యం వంటి వసతులు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందన్నారు. పిడుగురాళ్ల రైల్వే స్టేషన్‌లో ముఖ్యమైన రైళ్ల నిలుపుదల కోసం పలు వినతులు వచ్చినట్లు వాటిని కూడా త్వరలోనే వాటిని పరిష్కరించి ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తామన్నారు. ఏడీఆర్‌ఎం, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

మాంసం దుకాణాల్లో తనిఖీలు

38 మందిపై కేసులు



నగరంపాలెం: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని చేపలు, కోడి, మాంసం దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు ఆదివారం విస్తృత తనిఖీలు చేపట్టారు. గుంటూరు విజిలెన్స్ ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి ఆదేశాల మేరకు సోదాలు కొనసాగాయి. గుంటూరు నగరంలోని ఏటీ అగ్రహారం, గుజ్జనగుండ్ల, స్తంభాలగరువు, స్వామి థియేటర్ సెంటర్, నరసరావుపేటలోని మార్కెట్ సెంటర్, జొన్నలగడ్డ, రావిపాడు రోడ్ సెంటర్, బాపట్ల జిల్లాలోని చీరాల, కారంచేడు, పర్చూరులో తనిఖీలు నిర్వర్తించగా, తూనికలలో వ్యత్యాసాలు, స్టాంపింగ్ లేని తూకాలు వినియోగిస్తున్న నిర్వాహకులను గుర్తించారు. గుంటూరు జిల్లాలో 12, పల్నాడు జిల్లాలో 15, బాపట్ల జిల్లాలో 11 కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ సీఐ ఎ.శ్రీహరిరావు తెలిపారు. తనిఖీల్లో సీఐ టి.లక్ష్మారెడ్డి, ఎస్ఐ ఎం.రామచంద్రయ్య, తూనికలు– కొలతల శాఖ సహాయ కంట్రోలర్ జి.కొండారెడ్డి పాల్గొన్నారు.

దుర్గగుడిలో పలువురికి అంతర్గత బదిలీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో పలువురు ఉద్యోగులకు అంతర్గత బదిలీలు జరిగాయి. ఏఈఓలకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆదివారం ఆలయ ఈఓ భ్రమరాంబ ఆదేశాలు జారీ చేశారు. ఏఈఓ చంద్రశేఖర్ ప్రస్తుతం అన్నదానం, అకౌంట్స్, స్టేషనరీ విభాగాల బాధ్యతలు చూస్తున్నారు. ఆయన వద్ద నుంచి అన్నదానం విభాగం తొలగించి పరిపాలనా విభాగం బాధ్యతలు అప్పగించారు. బి.వెంకటరెడ్డి ప్రస్తుతం ప్రొవిజన్ స్టోర్స్ నిర్వహణను చూస్తుండగా, అదనంగా అన్నదానం బాధ్యతలు అప్పగించారు. ఏఈఓ ఎన్.రమేష్‌బాబుకు మెయిన్ టెంపుల్, పూజలు, ఫెస్టివల్, ట్రస్ట్‌బోర్డు బాధ్యతలతో పాటు ప్రసాదాల తయారీ బాధ్యతలు అప్పగించారు. సూపరింటెండెంట్ వై.హేమదుర్గాంబకు ఫెస్టివల్, పూజలు, అకౌంట్స్, జనరల్, చీరల విభాగం బాధ్యతలు అప్పగించారు. జూనియర్ అసిస్టెంట్ వి.ప్రణీత్‌బాబును అన్నదానం నుంచి అకౌంట్స్ విభాగానికి, వి.ఉమాశంకర్‌ను ప్రసాదం టికెట్ల జారీ కౌంటర్ నుంచి అన్నదానానికి, సీనియర్ అసిస్టెంట్ వి.వెంకటేశ్వరరావును ప్రసాదాల టికెట్ల జారీ కౌంటర్ నుంచి పేబిల్స్, ఎస్ఆర్ ఎంట్రీల విభాగానికి బదిలీ చేశారు. ఎన్ఎంఆర్ పి.పవన్‌కుమార్‌ను మెయిన్ టెంపుల్ నుంచి ప్రసాదాల టికెట్ల కౌంటర్‌కు, ఎన్ఎంఆర్ పి.శ్రీనివాసులును మెయిన్ టెంపుల్ నుంచి ప్రసాదాల టికెట్ల జారీ కేంద్రానికి బదిలీ చేశారు.

ప్రార్థనలు చేస్తున్న హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహాం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ, వేదికపై ఎమ్మెల్సీ డొక్కా, ఎమ్మెల్సీ అభ్యర్థి ఏసురత్నం దంపతులు



చివరిరోజు ప్రార్థనలకు హాజరైన విశ్వాసులు



'దేవా.. నీ గుడారములో అతిథిగా ఉండనిమ్ము'

ఘనంగా ముగిసిన 46వ గుడారాల పండుగ ప్రార్థనలు

గుంటూరు గోరంట్లలో హోసన్నా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 46వ గుడారాల పండుగలు ఆదివారంతో ముగిశాయి. మినిస్ట్రీస్ చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ దైవసందేశం అందజేశారు. ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్యవరప్రసాద్, లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరి, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, మిర్చియార్డ్ చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం దంపతులు ప్రత్యేక ప్రార్థనల్లో పాలొన్నారు. హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం 46వ గుడారాల పండుగలో పాల్గొన్న, సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

– గుంటూరు రూరల్

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గామల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకుని ఆశీస్సులు అందుకునేందుకు ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఇంద్రకీలాద్రికి ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రద్దీ కనిపించింది. ఆది దంపతులకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లోనూ ఉభయదాతలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. తెల్లవారుజామున ఖడ్గమాలార్చన, శ్రీచక్ర నవార్చన, లక్ష కుంకుమార్చన, చండీహోమం, నవగ్రహ హోమం, శాంతి కల్యాణంలోనూ ఉభయదాతలు పాల్గొన్నారు. ఆర్జిత సేవల్లో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ మార్గంలో అమ్మవారి దర్శనం కల్పించారు. సర్వ దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది.

గఘన సర్వే



రీసర్వేకు ఉపయోగిస్తున్న ఎయిర్ క్రాఫ్ట్

- పల్నాడులో ఎయిర్ క్రాఫ్ట్‌తో భూ సర్వే
- డ్రోన్లతో ఆలస్యం అవుతుండడంతో ఏరియల్ సర్వేకు శ్రీకారం
- రోజుకు సరాసరి 37 వేల ఎకరాలే లక్ష్యం
- ప్రస్తుతం గురజాల డివిజన్‌లో ఎగురుతున్న ఎయిర్ క్రాఫ్ట్
- ఏప్రిల్ చివరికి జిల్లా మొత్తం ఓఆర్‌ఐలు పూర్తి చేస్తామంటున్న అధికారులు

సాక్షి, నరసరావుపేట: దశాబ్దాలుగా అస్తవ్యస్తంగా ఉన్న రెవెన్యూ రికార్డులను ప్రక్షాళనం చేసి, రైతులకు సంపూర్ణ భూహక్కులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న భూహక్కు–భూరక్ష ద్వారా సమగ్ర భూ సర్వేకు శ్రీకారం చుట్టింది. వందల మంది వీఆర్‌ఓలు, సర్వేయర్లు, సాంకేతిక నిపుణులు డ్రోన్లతో సర్వే చేస్తున్నారు. ప్రభుత్వం ఈ ఏడాది చివరి కల్లా ప్రతి రెవెన్యూ గ్రామం రీసర్వే చేయాలని కృతనిశ్చయంతో ఉండటంతో మరింత వేగం పెంచాలని భావించారు. ఇందులో భాగంగా డ్రోన్లకు బదులుగా అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ఎయిర్ క్రాఫ్ట్ సర్వేను పల్నాడు జిల్లాలో నిర్వహిస్తున్నారు. ఈ ఎయిర్ క్రాఫ్ట్‌ల ద్వారా భూమికి సుమారు 2,500 మీటర్ల ఎత్తు నుంచి భూములకు సంబంధించిన ఛాయాచిత్రాలను స్పష్టంగా తీస్తున్నారు. ఇప్పటికే గురజాల డివిజన్‌లో గత వారం రోజులుగా ఎయిర్ క్రాఫ్ట్‌తో సర్వే నిర్వహిస్తున్నారు.

రోజుకు 37 వేల ఎకరాల సర్వే పూర్తి...

ప్రభుత్వం భూసర్వే ప్రక్రియ వేగవంతం చేయడానికి తొలుత డ్రోన్లలతో సర్వే చేపట్టింది. అయితే డ్రోన్ ద్వారా రోజుకు సుమారు 2 వేల ఎకరాలు మాత్రమే సర్వే చేయటానికి వీలవుతోంది. అదే ఎయిర్ క్రాఫ్ట్‌తో ఐతే రోజుకు సగటున 150 చ.కి.మీ (సుమారు 37,065 ఎకరాలు) భూములను సర్వే చేసి ఛాయా చిత్రాలను తీయవచ్చు. ఎయిర్ క్రాఫ్ట్ ప్రస్తుతం గన్నవరం విమానాశ్రయం నుంచి రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పల్నాడు జిల్లాలో సర్వే నిర్వహిస్తోంది. ఎయిర్ క్రాఫ్ట్ సర్వే ద్వారా వచ్చిన చిత్రాలను ల్యాబ్‌కు పంపి, అర్థోరెక్టిఫైడ్ ఇమేజ్(ఓఆర్‌ఐ)లను పరిశీలిస్తారు. ఓఆర్‌ఐలను ఏప్రిల్ చివరికి జిల్లాలో మొత్తం పూర్తి చేసేలా అధికారుల పనిచేస్తున్నారు. వీటి ఆధారంగా గ్రామాల్లో క్షేత్రస్థాయికి వెళ్లి హద్దులను నిర్ణయిస్తారు. అనంతరం రైతుల వద్ద నంచి వారి భూమి రికార్డులు, సర్వే నెంబర్లు పరిశీలించి భూములకు తాత్కాలిక ల్యాండ్ పార్శిల్ నెంబర్ కేటాయిస్తారు. రైతుల నుంచి అభ్యంతరాలు వస్తే గ్రౌండ్ అప్పీల్‌కు వెళ్లే అవకాశం ఇస్తారు. రెవెన్యూ అధికారులు అప్పీళ్లను పరిష్కారం చూపిన తర్వాత భూముల రికార్డులు తయారు చేస్తారు.

వేగంగా పూర్తి చేయడానికే ఎయిర్ క్రాఫ్ట్..



వందేళ్ల తర్వాత తొలిసారి పూర్తిస్థాయిలో భూములు రీసర్వే జరుగుతోంది. భూమిలో ఎవరు సాగు చేస్తున్నారు, హద్దులేంటి, ఏవైనా అభ్యంతరాలు ఉన్నాయా అన్న విషయాలను సమగ్రంగా పరిశీలించి రికార్డులను స్వచ్ఛీకరిస్తున్నాం. సర్వేను వేగవంతం చేసే ప్రక్రియలో భాగంగా ఎయిర్‌క్రాఫ్ట్‌లను వినియోగిస్తున్నాం. ఎట్టిపరిస్థితుల్లో ఈ ఏడాది చివరి నాటికి జిల్లా మొత్తం పూర్తిగా భూరికార్డులు స్వచ్ఛీకరిస్తాం.

– శివశంకర్ లోతేటి, పల్నాడు జిల్లా కలెక్టర్

రోజుకు 150చ.కి.మీ భూ సర్వే...



ప్రస్తుతం గురజాల డివిజన్‌లో ఎయిర్ క్రాఫ్ట్‌లతో రీసర్వే జరుగుతోంది. ఎయిర్ క్రాఫ్ట్ ద్వారా సరాసరి రోజుకు 150చ.కి.మీ భూమిని సర్వే చేస్తున్నాం. రోజు గన్నవరం నుంచి ఎయిర్‌క్రాఫ్ట్ వచ్చి సర్వే చేసి తిరిగి వెళుతుంది. ఏప్రిల్ చివరి నాటికి జిల్లా మొత్తం ఓఆర్‌ఐ మ్యాపులను పూర్తి చేస్తాం.

– ఎ.శ్యాంప్రసాద్, జేసీ, పల్నాడు

అత్యాధునిక టెక్నాలజీతో చేస్తున్న ఈ భూ రీస్వే ద్వారా భవిష్యత్‌లో రికార్డులు మార్చడం గాని, ట్యాంపరింగ్ గానీ చేసే వీలుండదు.

జిల్లాలో 13,66,403 ఎకరాల భూ విస్తీర్ణం...

పల్నాడు జిల్లాలో ల్యాండ్ అండ్ సర్వే అధికారులతో పాటు రెవెన్యూ అధికారులను సమన్వయం చేసుకుంటూ భూసర్వే ముందుకు వెళుతోంది. జిల్లాలో మొత్తం మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో 28 మండలాలు, 359 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 13,66,403 ఎకరాల భూ విస్తీర్ణం ఉంది. జిల్లాలో 370 మంది వీఆర్‌ఓలు, 361 మంది విలేజ్ సర్వేయర్లు పని చేస్తున్నారు.

బాలికలకు ఉన్నత భవిష్యత్తు ఇవ్వాల్సిన బాధ్యత మనదే

ఉమెన్స్‌డే పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించిన జిల్లా కలెక్టర్ శివశంకర్



నరసరావుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్, ఆరోగ్యశాఖ అధికారులు, విద్యార్థినులు

నరసరావుపేట: ఆడపిల్లలపై వివక్ష చూపకుండా వారిని చదివించి మంచి భవిష్యత్తును నిర్ణయించుకునే స్వేచ్ఛ ఇవ్వడం మనందరి బాధ్యతని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అన్నారు. ఈనెల 8వ తేదీ ఇంటర్నేషనల్ ఉమెన్స్ డేను పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం నుంచి ఏర్పాటుచేసిన ర్యాలీకి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. తాను కూడా ర్యాలీలో కొనసాగారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆడపిల్లలందరూ శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని సూచించారు. జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ జి.శోభారాణి మాట్లాడుతూ చదువుకుంటున్న రోజుల నుంచే ఆడపిల్లలందరూ మానసిక ఆరోగ్యం పెంపొందించుకొని దృఢ నిశ్చయంతో తమ ఆశయాలను నెరవేర్చుకోవాలని కోరారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి, క్షయ, కుష్టు వ్యాధుల నివారణ జిల్లా అధికారి డాక్టర్ పద్మావతి, డీఎంఓ డాక్టర్ రత్నాకర్, డీపీఓ ఒన్నురుబాషా, డీఈఎంఓ ఇన్‌చార్జి ఖాజావలి, పట్టణ ఆరోగ్య కేంద్ర సిబ్బంది, పట్టణ మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వామ్మో.. శునకాలు!

- నగరం, రూరల్‌లో కుక్కల స్వైరవిహారం
- కనిపించిన ప్రతి ఒక్కరికీ కాటు
- రాత్రిళ్లు అయితే మరీ దారుణం
- ప్రతి వీధిలో పదుల సంఖ్యలో..
- ఆదివారం ఒక్కరోజే 14 మందిపై కుక్కల దాడి.. వీరిలో 8 మంది చిన్నారులు
- కుక్కల సమస్యకు పరిష్కారం చూపాలని నగర వాసుల విజ్ఞప్తి



న్యూగుంటూరు రైల్వే స్టేషన్ రోడ్డులో రాత్రిళ్లు కుక్కల స్వైర విహారం



కుక్కల దాడిలో గాయపడిన స్వీట్ బండి వ్యాపారి

నెహ్రూనగర్/గుంటూరు ఈస్ట్: గుంటూరు నగరం, గుంటూరు రూరల్ మండలాల్లో ఏ వీధిలో చూసినా వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కనిపించిన వారిని కరుస్తూ భయాందోళనకు గురి చేస్తున్నాయి. రాత్రిళ్ల ఇంటి నుంచి రోడ్డు మీదకు రావాలంటే బయపడాల్సిన పరిస్థితి నెలకొంది. వీధి కుక్కల బారిన పడి ఎంతో మంది ఆసుపత్రుల పాలవుతున్నారు.

ఏబీసీ ఆపరేషన్లు చేయని అధికారులు..

వీధి కుక్కలకు పిల్లలు పుట్టకుండా యాంటీ బర్త్ కంట్రోల్(ఏబీసీ) ఆపరేషన్లు గతంలో ఏటుకూరు రోడ్డులో నగరపాలక సంస్థ అధికారులు పశు సంవర్ధక శాఖ డాక్టర్ల సహాయంతో చేసేవారు. అయితే గత రెండు సంవత్సరాల నుంచి ఈ ఆపరేషన్లు చేయకపోవడంతో కుక్కల సంతానోత్పత్తి అధికమైపోయింది. దీంతో రోడ్డు మీద వెళ్లేవారిని, బైక్‌లపై వెళ్లే వారిని అకస్మాత్తుగా వచ్చి కరిచేస్తున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా ప్రధాన కూడళ్ల వద్ద, రైల్వేస్టేషన్, బస్టాండ్, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో కుక్కల సంచారం అధికమవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

ఆదివారం ఒక్కరోజే 14 మందిపై దాడి..

ఆదివారం ఒక్క రోజే గుంటూరు నగరం, రూరల్ మండల పరిధిలో 14 మంది కుక్క కాటుతో గాయపడ్డారు. వారిలో 8 మంది చిన్నారులు కాగా, పెద్దవారు ఆరుగురు ఉన్నారు. వీరంతా జీజీహెచ్‌లో చికిత్స పొందారు. జీజీహెచ్‌లో ఏటీ అగ్రహారానికి చెందిన పదేళ్ల బాలతేజ, పాతగుంటూరుకు చెందిన 9 ఏళ్ల ఎల్.నందు, అంకిరెడ్డిపాలెనికి చెందిన 6 సంవత్సరాల కృపమ్మ, స్వర్ణ భారతి నగర్‌కు చెందిన ఆరేళ్ల ఆర్.ధనుష్, శ్యామలనగర్‌కు చెందిన 11 సంవత్సరాల ఎస్‌డీ సన, దాసరి పాలెంలో నివసించే నాలుగు సంవత్సరాల రెడ్డి ధర్మతేజ, గోరంట్లకు చెందిన 9 సంవత్సరాల టి.షణ్ముఖసాయి, నగరానికి చెందిన 16 సంవత్సరాల ఎంఆర్ దిలీప్ కుక్కల దాడిలో గాయపడి చికిత్స పొందారు. ప్రథమ చికిత్స అనంతరం డిశ్చార్జి అయ్యారు. సంగడిగుంటకు చెందిన రాఘవులు, కొల్లిపర మండలం శివలూరుకు చెందిన డి.ఇస్సాక్, గుంటూరుకు చెందిన సీహెచ్ కృష్ణమూర్తి, పెదకాకానికి చెందిన సయ్యద్ బషీద్, పాతగుంటూరుకు చెందిన ఎన్.నాగేశ్వరరావు, హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన 33 సంవత్సరాల డి.శ్రీనివాస్‌లు కుక్క కాటుకు గురై జీజీహెచ్‌లో ప్రాథమిక చికిత్స అనంతరం డిశ్చార్జి అయ్యారు.

త్వరలో కుక్కలకు ఏబీసీ ఆపరేషన్లు

త్వరలో కుక్కలకు యాంటీ బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఉన్నతాధికారులతో చర్చించి అందుకు తగిన కార్యచరణ పూర్తి చేశాం. ముందుగా కుక్కలకు మాస్ వ్యాక్సినేషన్ డ్రైవ్(యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్) పది రోజుల్లో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ భాను ప్రకాష్, గుంటూరు నగరపాలక సంస్థ ఎంహెచ్‌ఓ

దుర్గి శిల్పి చెన్నుపాటికి ప్రశంసలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరికి ప్రతిమను అందిస్తున్న శిల్పి శ్రీనివాస్

దుర్గి: వైజాగ్‌లో నిర్వహించిన జీఐఎస్ (గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్)లో భాగంగా స్థానిక నాగార్జున శిల్పకళ ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సందర్శించారు. ఈ సందర్భంగా పల్నాటి శిల్ప కళా నైపుణ్యాన్ని శిల్ప కళాశాల అధినేత చెన్నుపాటి శ్రీనివాసరావు వివరించారు. కేంద్ర మంత్రికి జ్ఞాపికను బహూకరించారు. శిల్ప కళను అతిథులు ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జీఐఎస్ సదస్సు కారణంగా తమ కళా నైపుణ్యం ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు రావడానికి దోహద పడిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రేపటి నుంచి సాగర్‌మాత ఉత్సవాలు

- భక్తులకు పకడ్బందీ ఏర్పాట్లు
- రెండు లక్షల మంది వచ్చే అవకాశం
- భారీ పోలీస్ బందోబస్తు





తిరునాళ్ల సందర్భంగా ముస్తాబైన సాగర్‌మాత దేవాలయాలు (ఇన్‌సెట్) దేవాలయంలో మేరీమాత విగ్రహం

విజయపురిసౌత్: సర్వమతాల సంగమంగా, ఆధ్యాత్మిక భావనకు ప్రతీకగా వెలుగొందుతున్న సాగర్‌మాత మహోత్సవాలను ఈ నెల 7, 8, 9 తేదీలలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దేశంలోనే భారతీయ సంప్రదాయ రీతులలో నిర్మించిన తొలి క్రైస్తవ మందిరంగా దీన్ని చెబుతారు. ఉత్సవాలకు రెండు లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు.

ప్రారంభం ఇలా..

సాగర్‌మాత ఉత్సవాలను 7వ తేదీ ఉదయం 5.30 గంటలకు విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ దివ్యబలిపూజతో ప్రారంభమవుతాయి. 6.30 గంటలకు గురుశ్రీ జోసఫ్ తంబి అన్నెంతో దివ్య బలిపూజ, 10 గంటలకు గోరంట్ల గురుశ్రీ గోపు జోసఫ్‌తో జపమాల, స్తుతి ఆరాధన, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదానం, 2గంటలకు గురుశ్రీ గోపు జోసఫ్‌తో వాక్య పరిచర్య, స్వస్థతా ప్రార్థనలు, సాయంత్రం 5.30గంటలకు రెంటచింతల విచారణ గురువులు గురుశ్రీ ఏరువ లూర్దు మర్రెడ్డితో జపమాల, నవదిన జపములు, తేరు ప్రదక్షిణ, దివ్యబలిపూజ, 7.30గంటలకు కొవ్వొత్తులతో తేరు ప్రదక్షిణ, రాత్రి 8గంటలకు సాగర్‌మాత కళాకారుల బృందంతో సాగర్‌మాత-సహాయమాత బుర్రకథ, రాత్రి 9గంటలకు ధన వంతుడు బీదలాజరు బైబిల్ నాటకం ప్రదర్శించనున్నారు. 8వ తేదీ ఉదయం 5గంటలకు గురుశ్రీ రాచకొండరాజుచే దివ్య బలిపూజ, 6గంటలకు మాచవరం విచారణ గురువులు గురుశ్రీ నాగోతు చిన్నయ్యతో దివ్యబలిపూజ, 7గంటలకు గురుశ్రీ కొచ్చర్ల జ్యోతిరాజుచే దివ్య బలిపూజ, 9.30 గంటలకు గురుశ్రీ సిరిల్‌తో భక్తుల ఆహ్వానం, జపమాల, స్తుతీ ఆరాధన, వాక్యపరిచర్య, ఉదయం 11.30గంటలకు దివ్యబలిపూజ, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదాన కార్యక్రమం, 2 గంటలకు వాక్యపరిచర్య, స్వస్థతా ప్రార్థనలు, సాయంత్రం 4గంటలకు కోలాటం, 5.30గంటలకు ఫిరంగిపురం విచారణ గురువులు గురుశ్రీ పామిశెట్టి బాలస్వామి, చెరుకుపల్లి విచారణ గురువులు గురుశ్రీ అల్లం శౌర్రెడ్డి, మంగళదాస్‌నగర్ విచారణ గురువులు గురుశ్రీ కసిరెడ్డి జోషప్‌రెడ్డి జపమాల క్షేత్రంలో సమిష్టి దివ్యబలిపూజ, రాత్రి 7.30గంటలకు కొవ్వొత్తులతో తేరు ప్రదక్షిణ, 8గంటలకు ఆర్‌సీఎం స్కూల్, మాచర్ల సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం, సెయింట్ జోసఫ్ స్కూల్ విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, 9గంటలకు శిరిగిరిపాడు కళా నాట్యమండలి రక్తబలి బైబిల్ నాటకం ప్రదర్శించనున్నారు.

ప్రధాన మహోత్సవం

9వ తేదీ సాగర్‌మాత రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ ఊరేగింపుతో ఉత్సవం ముగుస్తుంది. ఆ రోజు ఉదయం 5 గంటలకు పిడుగురాళ్ల విచారణ గురువులు గురుశ్రీ పూదోట మరియ దాసయ్యతో దివ్యబలిపూజ, 6గంటలకు చిలకలూరిపేట విచారణ గురువులు పెట్ల మరియదాసుతో దివ్యబలిపూజ, 7 గంటలకు ఆత్మకూరు విచారణ గురువులు గురుశ్రీ ఉన్నం కిరణ్‌తో దివ్యబలిపూజ, 8గంటలకు ఏరువ బాలశౌర్రెడ్డితో దివ్యబలిపూజ, ఉదయం 10.30 గంటలకు గుంటూరు పీఠాధిపతులు చిన్నాబత్తిని భాగయ్యతో సమిష్టి దివ్య పూజ, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే గురవరేణ్యులు గురుశ్రీ పామిశెట్టి తోమస్ బృందంతో గానం, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదాన కార్యక్రమం, 6గంటలకు కోలాటం, బ్యాండ్‌మేళం ప్రదర్శన, సాగర్ మాత రథోత్సవం, బాణసంచా కార్యక్రమాలు, రాత్రి 9.30గంటలకు పది ఆజ్ఞలు చలనచిత్ర నిర్వహించనున్నారు. ఏసు ప్రభ పడిన శ్రమలను స్మరించుకుంటూ మోకాళ్ల నడక ప్రార్థన చేస్తూ సాగర్‌మాతను దర్శించుకొనుటకు ఇసుకరోడ్‌ను నిర్మించారు.

ఆర్టీసీ బస్సులు..

మాచర్ల మండలం కొప్పునూరు ప్రాథమిక వైద్యశాల ఆధ్వర్యంలో పండుగ మూడు రోజులు వైద్య శిబిరం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. మాచర్ల ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ప్రతి అరగంటకు విజయపురిసౌత్‌లోని సాగర్‌మాత దేవాలయానికి బస్‌లు అందుబాటులో ఉంటాయి.

విస్తృత బందోబస్తు

ఉత్సవాలకు తరలి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా మాచర్ల రూరల్ సీఐ సమీముల్లా ఆధ్వర్యంలో 200 మందితో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. మహిళా భక్తుల భద్రత కోసం ప్రత్యేకంగా షీ టీమ్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. గుడి సమీపంలోని కృష్ణా జలాశయంలో స్నానం చేసే భక్తుల భద్రత కోసం గజ ఈతగాళ్లను, ప్రత్యేక బోట్‌ను పోలీసులు అందుబాటులో ఉంచే విధంగా చర్యలు చేపట్టారు.

సంక్షేమ పథకాలు సకాలంలో ప్రజలకు అందించండి

జిల్లా కలెక్టర్ శివశంకర్



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, డీఆర్వో వినాయకం

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో అధికారులందరూ సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు సకాలంలో అందే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ వీడియో కాన్ఫరెన్సు హాలులో కొన్ని మండలాలలో 'మిషన్ శోభకృత్'పై జరుగుతున్న పనుల తీరు, 'కాఫీ విత్ క్లాప్ మిత్ర' కార్యక్రమం నిర్వహిస్తున్న తీరుపై అధికారులను ఆరా తీశారు. మండల, జిల్లా సరిహద్దులు ఎన్ని ఉన్నాయి? వాటిలో ఎన్ని బోర్డులు ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. ఉగాది పండుగ నాటికల్లా అన్ని పనులు పూర్తి చేసి, తెలుగువారి నూతన సంవత్సరంలో అన్నీ కార్యాలయాలు పరిశుభ్రతను సంతరించుకోవాలని కోరారు. అన్ని వసతులు, వనరులుతో తయారైన కార్యాలయాల్లో అధికారులు అంతా పరిపాలనలో కొత్త దనాన్ని చూపించాలని సూచించారు.

రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించండి

సత్తెనపల్లి: ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ సూచించారు. సత్తెనపల్లి మండలం ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జాతీయ నాణ్యత ప్రమాణాల సూచిక(ఎన్ క్వాస్) సర్టిఫికేషన్‌కు సంబంధించి ఆదివారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. దీనిలో భాగంగా వైద్యశాలలోని అన్ని విభాగాలను క్షుణంగా పరిశీలించారు. అనంతరం ఓపీ రిజిస్టర్ ను పరిశీలించి వైద్యురాలు డాక్టర్ యు.శ్రీలక్ష్మీ కవితకు సూచనలు చేశారు. ఫార్మసీ విభాగాన్ని పరిశీలించి మందులు పంపిణీ తీరును ఫార్మసిస్ట్ సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వీ సీతారామమ్మ, పీహెచ్ఎన్ జీవీసీకే మీనాక్షమ్మ ఉన్నారు.

ఇద్దరు బాలికలపై లైంగిక దాడికి యత్నం

- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన
- పోలీసుల అదుపులో నిందితుడు

నాదెండ్ల: చిన్నారులపై ఓ యువకుడు లైంగిక దాడికి యత్నించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని గణపవరం చవిటిపాలెంలోని మండల ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వాహకురాలిగా పనిచేస్తున్న రాహేలమ్మ మనవడు పాతికేళ్ల బాబ్జి వెల్డింగ్ పనులకు వెళ్తుంటాడు. పనులు లేని సమయంలో నాయనమ్మతో కలసి పాఠశాలకు వచ్చి సహాయపడతాడు. గత వారం రోజుల కిందట సాయంత్రం పాఠశాలలో చదువుతున్న 1, 2 తరగతులు చదివే ఇద్దరు చిన్నారులతో దాగుడు మూతల ఆటలు ఆడుకుందామంటూ వంట గదిలోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. ఇది జరిగిన రెండు రోజుల తర్వాత బాలిక తన కడుపులో ఇబ్బందిగా ఉందంటూ తల్లిదండ్రులకు చెప్పడంతో స్కూల్ వచ్చి స్నేహితులను విచారించారు. గర్రెపూడి బాబ్జి ఇద్దరు చిన్నారులతో ఆటలాడుతూ అసభ్యంగా ప్రవర్తించిన విషయం బయటపడింది. దీంతో స్కూల్ హెచ్ఎం నార్నెపాటి శ్రీనివాసరావు, మహిళా పోలీసులకు సమాచారం అందించారు. బాలికల తల్లిదండ్రుల నుంచి రాతపూర్వకంగా ఫిర్యాదు తీసుకున్న మహిళా పోలీస్, స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ ఎ.భాస్కర్ కేసు నమోదు చేసుకుని యువకుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

ఈ నెల 7,8 తేదీల్లో సాఫ్ట్‌బాల్ పోటీలు

ఉప్పూరు: అంతర్ కళాశాలల సాఫ్ట్‌బాల్ పోటీలు ఈనెల 7, 8 తేదీల్లో నిర్వహించనున్నట్లు ముప్పాళ్ల ధనలక్ష్మి వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకట్రావు తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ క్రీడాప్రాంగణంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేత జట్టుకు మేదరమెట్ల అంజమ్మ మస్తాన్‌రావు మెమోరియల్ రోలింగ్ ట్రోఫీని ప్రదానం చేయనున్నట్లు వివరించారు.

నేడు డీపీఓలో మహిళలకు ఉచిత వైద్య శిబిరం

నగరంపాలెం: ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని పోలీస్ యూనిట్ ఆసుపత్రిలో మహిళా పోలీసులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒమేగా ఆసుపత్రి సౌజన్యంతో ఉదయం 8 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. బీపీ, మధుమేహం, గుండె, క్యాన్సర్ వంటి వ్యాధులకు నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నారు. మహిళా పోలీసులు, వారి కుటుంబ సభ్యులు (మహిళలు) సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ తెలిపారు.

రేపు 108 అంబులెన్స్ డ్రైవర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో 108 అంబులెన్స్‌లో డ్రైవర్ ఉద్యోగాలకు ఈ నెల 7న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఆర్ నరసింహరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. హెవీ డ్రైవింగ్ లైసెన్స్, పదో తరగతి ఉత్తీర్ణులై ఇంగ్లిషు చదవటం, రాయటం వచ్చిన 35 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ.18 వేలు చెల్లిస్తారన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ఒంగోలు ఓల్డ్ రిమ్స్ క్యాంపస్‌లో ఉదయం 10 గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని వెల్లడించారు.

చిరుధాన్యాల పోషక విలువలను గుర్తించాలి

జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్



చిరుధాన్యాల స్టాల్స్‌ను పరిశీలిస్తున్న జేసీ శ్యాంప్రసాద్

నరసరావుపేట ఈస్ట్: అత్యంత పోషక విలువలతో కూడిన చిరుధాన్యాల ప్రాధాన్యతను ప్రతిఒక్కరూ గుర్తించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ అన్నారు. నవోదయనగర్‌లోని హిందూ స్కూల్‌లో ఆదివారం మిల్లెట్ మానియా-2023 చిరుధాన్యాలతో కూడిన వంటకాల ప్రదర్శన నిర్వహించారు. జేసీ శ్యాంప్రసాద్, ఆయన సతీమణి భాగ్యలక్ష్మి, జిల్లా కలెక్టర్ సతీమణి లక్ష్మి ప్రదర్శనను తిలకించి విద్యార్థులు ఇంటివద్ద తయారుచేసి తీసుకవచ్చిన చిరుధాన్యాల వంటకాల రుచిని ఆస్వాదించి విద్యార్థులను అభినందించారు. జేసీ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ చిరుధాన్యాల ప్రాధాన్యతను గుర్తించిన ప్రధాని నరేంద్రమోదీ 2023 సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో హెల్త్ సూత్ర సీఈఓ శివసాయికృష్ణ భరద్వాజ్, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అఫెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, పాఠశాల డైరెక్టర్ పి.వి.రావు, శివప్రియ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాతకోటయ్య స్వామిని దర్శించుకున్న జేసీ

నరసరావుపేటరూరల్: కోటప్పకొండలోని త్రికోటేశ్వర స్వామిని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న జాయింట్ కలెక్టర్ దంపతులకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జేసీ శ్యామ్‌ప్రసాద్ దంపతులకు స్వామివారి ప్రసాదాలు అందజేశారు. జేసీ దంపతులు పాతకోటయ్య స్వామి ఆలయానికి నడకమార్గాన చేరుకున్నారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వైద్యులకు ఆటవిడుపు ఎంతో అవసరం

మేయర్ కావటి మనోహర్ నాయుడు



వైద్యులను పరిచయం చేసుకుంటున్న నగర మేయర్ మనోహర్ నాయుడు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): నిత్యం పని ఒత్తిడిలో ఉండే వైద్యులకు ఆటవిడుపు ఎంతో ముఖ్యమని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జేకేసీ కళాశాల క్రికెట్ మైదానంలో డాక్టర్స్ ప్రీమియర్ లీగ్ టీ20 క్రికెట్ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతూ భగవంతుడికి మరో రూపమే వైద్యులన్నారు. అంతటి పవిత్ర వృత్తిని ఒత్తిడి లేకుండా కొనసాగించాలంటే వ్యాయామం తప్పనిసరన్నారు. ఐఎంఏ అధ్యక్షుడు ఆవుల శ్రీనివాసరావు మాట్లాడుతూ 14వ తేదీ వరకు జరగనున్న ఈ పోటీల్లో ప్రతి రోజూ రెండు మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ కార్యదర్శి వెలగా మహేష్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ టి.సేవా కుమార్ పాల్గొన్నారు.

జియాలజీ విభాగ అభివృద్ధికి సంపూర్ణ సహకారం

పూర్వ విద్యార్థుల సమావేశంలో నిర్ణయం



జియాలజీ విభాగాధిపతి రత్నాకర్, పి.శంకరపిచ్చయ్య, పూర్వ విద్యార్థులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జియాలజీ విభాగాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని ఆ విభాగ పూర్వ విద్యార్థులు హామీ ఇచ్చారు. జియాలజీ విభాగాధిపతి డాక్టర్ పీజే రత్నాకర్ అధ్యక్షతన ఆదివారం యూనివర్సిటీ జియాలజీ విభాగ పూర్వ విద్యార్థుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో విభాగం ఏర్పాటయిన 1985 నుంచి ఇప్పటి వరకు ఉన్న అన్ని బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. వయస్సు, హోదా లేకుండా అన్ని బ్యాచ్‌ల వారు కలిసి సరదాగా గడిపారు. విద్యార్థులుగా, పరిశోధకులుగా తాము యూనివర్సిటీలో గడిపిన మధుర క్షణాలను గుర్తు చేసుకున్నారు. కొందరు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తాము జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడటానికి యూనివర్సిటీ పునాది వేసిందని, గురువులు తమకు చూపిన మార్గదర్శకం ఎప్పటికీ మరువలేమన్నారు. తాము ఎక్కడ పని చేస్తున్నా, ఎక్కడ ఉన్నా ఎప్పటికీ యూనివర్సిటీతో తమ అనుబంధం కొనసాగాలని ఆకాంక్షించారు. తమ ఉన్నతికి దోహదం చేసిన జియాలజీ విభాగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. తాము పని చేస్తున్న జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి జియాలజీ రంగ సంస్థలు, విద్యాసంస్థల్లో ఏఎన్‌యూ జియాలజీ విభాగ విద్యార్థులు, పరిశోధకులకు శిక్షణ, పరిశోధన ప్రాజెక్టుల్లో అవకాశం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. జియాలజీ విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు ఫీల్డ్‌కు సంబంధించిన ఇంటెర్న్‌షిప్ ఎంతో అవసరమని, తమ సంస్థల్లో ప్రస్తుత విద్యార్థులకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. జియాలజీ విభాగంలోని ల్యాబొరేటరీలు, మ్యూజియం మరింత అభివృద్ధి చేసేందుకు కావాల్సిన పరికరాలు అందిస్తామని తెలిపారు. సమావేశంలో విభాగ విశ్రాంత అధ్యాపకులు ఆచార్య రంగారావు, ఆచార్య పి.శంకరపిచ్చయ్య, పలు జాతీయ, రాష్ట్ర స్థాయి జియాలజీ రంగ పరిశోధనా సంస్థల్లో ఉన్నత స్థాయిలో పని చేస్తున్న అధికారులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

స్కూటీని ఢీకొట్టిన ఇన్నోవా

జే పంగులూరు: రోడ్డును క్రాస్ చేయబోయిన స్కూటీని ఇన్నోవా ఢీకొట్టడంతో వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందిగా ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం జాతీయ రహదారిపై వెంకటాపురం స్టేజి సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. రేణింగవరం ఎస్సై తిరుపతిరావు వివరాల మేరకు.. పంగులూరు మండలంలోని అలవలపాడు గ్రామానికి చెందిన ఎర్రమోసు మోహన్ రావు, గొట్టిపాటి వసంత, గొట్టిపాటి సుబ్బమ్మ, (77)లు స్కూటీపై అలవలపాడు నుంచి అద్దంకికి బయలుదేరారు. జాతీయ రహదారిపై అలవలపాడు స్టేజి దాటి వెంకటాపురం స్టేజి వైపు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా గుంటూరు వైపు నుంచి వస్తున్న ఇన్నోవా కారు స్కూటీని ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కూటీపై మధ్యలో కూర్చున్న గొట్టిపాటి సుబ్బమ్మ కిందపడగా తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మరణించింది. ఎర్రమోసు మోహన్ రావు, గొట్టిపాటి వసంతలకు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నర్సింగ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

26 ఏళ్ల తరువాత గుంటూరులో కలయిక



సమ్మేళానికి హాజరైన పూర్వ విద్యార్థులు

గుంటూరు మెడికల్: రోగుల సేవే తమ వృత్తిగా ఎంచుకుని ఎంతో మంది రోగుల ప్రాణాలు కాపాడటంలో వైద్యులతో పాటుగా తమవంతు పాత్ర పోషించిన గుంటూరు జీజీహెచ్ ప్రభుత్వ నర్సింగ్ పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం గుంటూరులో ఒక్కచోట చేరారు. గుంటూరు ఏపీఎన్‌జీఓ హోమ్ వద్ద అంతా కలుసుకుని పాతికేళ్ల జ్ఞాపకాలనుఃగుర్తు చేసుకున్నారు. నర్సింగ్ స్కూల్‌లో చదుకునే రోజుల్లో నిక్ నేమ్‌లతో పిలుచుకున్న పేర్లు నేడు ఒకసారి మననం చేసుకుని మధుర జ్ఞాపకాల్లో ఓలలాడారు. గుంటూరు జీజీహెచ్ ఆవరణంలోని ప్రభుత్వ నర్సింగ్ పాఠశాలలో 1994-1997లో జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ కోర్సు పూర్తిచేసిన వారు ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం గుంటూరు జిల్లా సెక్రటరీ యల్లంపల్లి పద్మజ ఆధ్వర్యంలో ఆదివారం రీయూనియన్ పేరుతో కలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన నర్సింగ్ పాఠశాలను సందర్శించారు. అమెరికాలో నర్సింగ్ వృత్తిలో రాణిస్తున్న టి.మధురిమ, మేరీ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల్లో వివిధ హోదాల్లో నర్సింగ్ సేవలు అందిస్తున్న సుమారు 50 మంది పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయికలో ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో నర్సుల సంఘం సెక్రటరీ యల్లంపల్లి పద్మజ, విజయవాడ ఆయుష్ హాస్పటల్ నర్సింగ్ ఇన్‌చార్జి కె.రమాదేవి, కరీంనగర్ అపోలో హాస్పటల్ నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మ, ఏపీఎస్ ఆర్టీసీ స్టాఫ్ నర్సు డి.వజ్రవతి, విజయవాడ హెడ్ నర్స్ జి.మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఏపీఆర్‌జేసీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రారంభం



ఎన్ఎస్ఎస్ యూనిట్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న రవికిరణ్

విజయపురిసౌత్: స్థానిక ఏపీఆర్ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్‌ను పూర్వ విద్యార్థి, తెలంగాణ రాష్ట్ర ఇన్‌కంటాక్స్ కమిషనర్ కె.రవికిరణ్ ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆచార్య నాగార్జునుడు నడియాడిన పుణ్యభూమి నాగార్జునసాగర్ ప్రాంతమని చెప్పారు. ఈ పుణ్యభూమిలో నెలకొల్పిన ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో చదివిన ఎందరో దేశ, విదేశాలలో అత్యున్నత స్థానాలలో ఉన్నారన్నారు. 1985-87 బ్యాచ్‌కు చెందిన తమ ఫ్రెండ్స్ సహకారంతో కళాశాలకు ప్రస్తుతం చదువుతున్న విద్యార్థుల కోసం రూ.3లక్షలతో ఎన్ఈఈ, ఎంసెట్, జేఈఈ, ఎన్‌టీటీ, ఐఏఎస్ వంటి కాంపిటీటివ్ పరీక్షల పుస్తకాలను కళాశాలకు అందించటం జరిగిందన్నారు. అనంతరం సోలార్ ల్యాంప్స్, ఎన్ఎస్ఎస్, మెడికల్, స్పోర్ట్స్ కిట్స్ అందించిన పూర్వ విద్యార్థులకు ప్రిన్సిపాల్ రంగాచారి కృతజ్ఞతలు తెలిపారు. రవికిరణ్‌ను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వేణుగోపాల్, శరత్‌బాబు, హేమాంబర్‌రెడ్డి, రాజశేఖర్, చంద్రశేఖర్, పుల్లయ్య, గోపయ్య, నాగేంద్రబాబు, పూర్వ విద్యార్థులు రమేష్‌నాయుడు, అనూక్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



మాట్లాడుతున్న ఘంటసాల శ్రీనివాసరావు

గుంటూరు మెడికల్: వృత్తి జీవితం, దైనందిన కార్యక్రమాల్లో ఎదురయ్యే ఒత్తిడిని క్రీడలతో జయించవచ్చని, క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని ఏపీ ఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న వివిధ సాంస్కృతిక, క్రీడా పోటీల్లో భాగంగా ఆదివారం గుంటూరు నగరంపాలెంలోని ఆఫీసర్స్ క్లబ్ ఇండోర్ స్టేడియంలో షటిల్ టోర్నమెంట్ జరిగింది. అడిషనల్ ఎస్పీ సుప్రజ, నేహా గున్ని అతిథులుగా విచ్చేసి షటిల్ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో సెంట్రల్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ విల్సన్‌బాబు, అసోసియేషన్ జిల్లా సెక్రటరీ శెట్టిపల్లి సతీష్‌కుమార్, మహిళా విభాగం చైర్‌పర్సన్ ఎం.రాధారాణి, కన్వీనర్ కె.లక్ష్మీరమ్య, నగర అధ్యక్షుడు ఎస్పీఎస్ సూరి సభ్యులు పాల్గొన్నారు.